క్లుప్తంగా

భోజనం ప్యాకెట్ల వితరణ



భోజన ప్యాకెట్లు అందజేస్తున్న శాంసన్ జాషువా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక సరస్వతీ ఘాట్, రోడ్డు కం రైలు బ్రిడ్జి కింద ఉన్న నిరాశ్రయులకు గుడ్ సమరిటన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు దొలూరి శాంసన్ జాషువా భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా తమ సంస్థ ద్వారా వితంతువులు, నిరాశ్రయులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పేదలకు మరిన్ని సేవలు చేస్తామన్నారు.

విహారంలో విషాదం

ఒకరి మృతి



మరణించిన సాయితేజ

గూడెంకొత్తవీధి (అల్లూరి సీతారామరాజు జిల్లా): పర్యాటకుల వాహనం ప్రమాదానికి గురవడంతో విహార యాత్ర విషాదంగా మారింది. రాజమహేంద్రవరానికి చెందిన వేమన సాయితేజ కుటుంబ సభ్యులు పాడేరు డివిజన్‌లో పర్యాటక ప్రాంతాల సందర్శనకు సోమవారం ప్రత్యేక వాహనంలో వచ్చారు. అరకు, జి.మాడుగుల ప్రాంతాల్లో ప్రకృతి అందాలను తిలకించారు. అనంతరం బూదరాళ్ల రహదారిలో రాజమహేంద్రవరం బయలుదేరారు. బొంతువలస సమీపంలోని మలుపు వద్దకు వచ్చే సరికి వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న సాయితేజ (22) మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించామని ఎస్‌ఐ అప్పలసూరి తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

ఒకరి మృతి, మరొకరికి గాయాలు



మృతి చెందిన అరుణ

రాజానగరం: మృత్యువు ట్రాక్టర్ రూపంలో ఆమెను కబళించింది. అక్కాచెల్లెళ్ల బంధాన్ని విడదీసింది.. దైవ దర్శనం చేసుకుని ఆనందంగా ఇంటికి స్కూటీపై వస్తున్న అక్కాచెల్లెళ్లలో అక్క మీసాల అరుణ (26) అక్కడికక్కడే మృతి చెందగా.. చెల్లెలు పప్పు శ్రీవిద్య తీవ్రంగా గాయపడింది. రంగంపేట మండలం వెంకన్నపేటకు సమీపంలో ఏడీబీ రోడ్డుపై మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఎస్టీ రాజాపురానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు పప్పు వెంకటేశ్వర్రావు కుమార్తెలైన ఈ అక్కాచెల్లెళ్లు ఇద్దరూ స్కూటీపై రాజమహేంద్రవరంలోని ఇస్కాన్ టెంపుల్‌కు వెళ్లి దైవ దర్శనం చేసుకుని తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. కొద్దిసేపటిలో ఇంటికి చేరుకోవాల్సిన వారిలో అరుణ మృతి చెందగా శ్రీవిద్య గాయాలతో ఆస్పత్రిలో చేరారు. ముందు వెళ్తున్న ట్రాక్టరును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా కారు రావడంతో కంగారు పడ్డారు. దీంతో స్కూటీ అదుపుతప్పి ట్రాక్టరు వెనుక ట్రక్కు కింద పడటం, పై నుంచి చక్రాలు వెళ్లడంతో అరుణ అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన శ్రీవిద్యను వెంటనే 108 వాహనంలో జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. శ్రీవిద్య గ్రామ వలంటీర్‌గా పనిచేస్తుంది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సరిహద్దు సమస్యతో ట్రాఫిక్ జామ్

రాజానగరం నుంచి కాకినాడకు ఉన్న ఏడీబీ రోడ్డుపై 'సాక్షి' ముద్రణా కార్యాలయం వరకూ రాజానగరం పోలీసు స్టేషన్, ఆపై వెంకన్నపేట–ఎస్టీ రాజాపురం నుంచి రంగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తాయి. ఈ ప్రమాదం సరిగ్గా సెంటర్ పాయింట్‌లో జరగడంతో కొద్దిసేపు రెండు పోలీసు స్టేషన్ల సిబ్బంది నడుమ సరిహద్దు సమస్య ఎదురైంది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందన లేకపోవడంతో రోడ్డుపై ఇరువైపులా ట్రాఫిక్ జామ్ అయ్యింది. చివరకు రాజానగరం పోలీసులు తమ పరిధిగా గుర్తించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. 'యు' ఆకారంలో మలుపు తిరిగి ఉండే ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

సినిమాలు



శ్యామల: లియో
సూర్యమినీ: టైగర్ నాగేశ్వరరావు
సూర్యప్యాలెస్: భగవంత్ కేసరి
స్వామి: టైగర్ నాగేశ్వరరావు
శివజ్యోతి: లియో
అనుశ్రీ: భగవంత్ కేసరి
రాజా: టైగర్ నాగేశ్వరరావు
అశోక: భగవంత్ కేసరి
ఊర్వశి: టైగర్ నాగేశ్వరరావు
మేనక: మేడ్
అప్సర: లియో

నామవరం:
వీఎస్ మహల్: టైగర్ నాగేశ్వరరావు

ధవళేశ్వరం:
మురళీకృష్ణ: భగవంత్ కేసరి, లియో

కడియం:
వెంకటసూర్య: టైగర్ నాగేశ్వరరావు



కంబాలచెరువు పార్కులో ఫుట్‌పాత్ బ్రిడ్జి



స్కై సైక్లింగ్ చేస్తున్న యువకులు



చిన్నారులకు విజ్ఞానాన్ని అందించే మోరల్ పార్కు

నందన వనమిది... అందరిదీ

- చూడచక్కగా ముస్తాబైన కంబాలచెరువు పార్కు
- ఆహ్లాదానికి కేరాఫ్ అడ్రస్

రాజమహేంద్రవరం సిటీ: మిరిమిట్లు గొలుపే వెలుగులు... చూడచక్కని ఫౌంటేన్లు.. ఆహ్లాదాన్ని పంచే ఎన్నో ఆట బొమ్మలు.. ఇలా ఒకటేమిటి నందన వనమిది.. అందరిదీ అన్నట్లు కంబాలచెరువు పార్కు రూపుదిద్దుకుంది. ఆధునిక హంగులతో చుట్టుపక్కల జిల్లాల్లోనూ ఎక్కడా లేని విధంగా ఈ పార్కు తయారైంది.. నగర ప్రజలను ఆనందసాగరంలో ముంచెత్తుతోంది. అన్ని వయసుల వారికి ఆహ్లాదంతో పాటు విజ్ఞానాన్ని పంచుతోంది. అందుకే నిత్యం వేల సంఖ్యలో సందర్శకులతో కిటకిటలాడుతోంది.

కంబాలచెరువు పార్కు కొత్త రూపును సంతరించుకుని రారమ్మని పిలుస్తోంది. గతానికన్నా భిన్నంగా ప్రస్తుతం ఉన్న పార్కు తయారైంది. ఇప్పుడు అద్భుతంగా మారింది. రూ.13 కోట్లతో అధునాతనంగా తయారు చేసిన ఈ పార్కును చూసేందుకు సందర్శకులు పోటీ పడుతున్నారు. ఎమ్యూజ్‌మెంట్ పార్కు మాదిరి నూతన ఆవిష్కరణలను ఏర్పాటు చేశారు. చిన్నారులు సాహసం చేసేందుకు పలు రకాల ఏర్పాట్లు చేశారు. చిన్నారులకు ఆహ్లాదంతో పాటు విజ్ఞానాన్ని అందించే విధంగా నీతి కథలు బోధించే మోరల్ పార్కు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసే ఆరోగ్యానిచ్చే విధంగా మట్టితో ఫుట్‌పాత్ సిద్ధం చేశారు. గతంలో పార్కులోకి ఎప్పుడు పడితే అప్పుడు వెళ్లటానికి అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం పార్కులో ప్రవేశానికి సమయాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ కేటాయించారు. అదే విధంగా పార్కులో ప్రవేశానికి వివిధ సమయాల్లో టికెట్ ధర నిర్ణయించారు. ప్రతి ఎంట్రీ టికెట్ మూడు గంటల కాల వ్యవధి నిర్ణయించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.59 గంటల వరకూ ప్రవేశ రుసుం పెద్దలకు రూ.30, చిన్నారులకు రూ.20గా పెట్టారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకూ ప్రవేశ రుసుం పెద్దలకు రూ.50, చిన్నారులకు రూ.30గా ఉంది. అత్యాధునికంగా సిద్ధం చేసిన లేజర్ షో రాత్రి 7, 8, 9 గంటలకు మూడు సార్లు ప్రదర్శించనున్నారు.



అందాలు విరజిమ్ముతున్న లేజర్ షో

పార్కులో వివిధ ధరలు ఇలా..

జిప్ లేనర్ టికెట్ రూ.250
(ఆరేళ్లు దాటి 85 కిలోల లోపు వారికి మాత్రమే)
స్కై సైకిల్ రూ.250
(12 ఏళ్లు దాటి 85 కిలోల లోపు వారికి మాత్రమే)
పెడల్ బోటింగ్ 15 నిమిషాలకు రూ.100
(12 ఏళ్లు దాటిన వారికి)
హ్యూమన్ గైరో రూ.50
(పదేళ్లు దాటిన వారికి అనుమతి)
360 డిగ్రీ సైకిల్
(8 ఏళ్లు దాటి 90 కిలోలలోపు వారికి మాత్రమే)
టోటల్ ప్యాకేజీ రూ.500లుగా నిర్ణయించారు.

మరింత అభివృద్ధి చేస్తాం



నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు కంబాలచెరువు పార్కును సిద్ధం చేశాం. నగరంలో మరింత అభివృద్ధి, సుందరీకరణ పనులు చేసేందుకు రూ.కోట్లు వెచ్చిస్తున్నాం. భవిష్యత్ తరాలకు రాజమహేంద్రవరం అద్భుతమైన నగరంగా తయారు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. కంబాలచెరువు చుట్టుపక్కల ప్రాంతాన్ని అద్భుతంగా తయారు చేశాం.

–దినేష్‌కుమార్, కమిషనర్ నగరపాలక సంస్థ

నేడు 'బాధ్యత' వార్షికోత్సవం

కడియం: బాధ్యత సేవా సంస్థ 15వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) తెలిపారు. ఈ మేరకు ఆయన కడియంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక హైస్కూల్ ఆవరణలో నిర్మించిన గిరజాల కృష్ణారావు కళావేదిక ప్రారంభిస్తామన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, విశిష్ట సత్కారాలు, ప్రముఖులకు పురస్కారాలు అందజేస్తామన్నారు. దీనికి జిల్లా నలుమూలల నుంచి రాజకీయ ప్రముఖులు హాజరవుతారన్నారు.

ఒకటి నుంచి సీపీఐ జనం బాట

ప్రకాశంనగర్: వచ్చే నెల 1 నుంచి 15 వరకూ సీపీఐ జనం బాట నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా సమావేశం జరిగింది. దీనికి మధు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై 15 రోజుల పాటు ప్రతి వార్డులో జనం బాట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం మల్లికార్జుననగర్‌లో వాటర్ ట్యాంకులు మెడికల్ కళాశాల రోడ్డులో సారా విక్రయిస్తున్న యరక గణేష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతని నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

పారదర్శక పాలనకు వైఎస్సార్ సీపీ చిరునామా

పార్టీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: పారదర్శక పాలనకు వైఎస్సార్ సీపీ చిరునామాగా నిలుస్తుందని ఆ పార్టీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలంటే సంస్థాగత కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ ఒకటో తేదీ నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సచివాలయాల ఏర్పాటుతో ప్రజల ముంగిటకే పాలనను తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమానికి సంబంధించి రెండు రోజుల ప్రచార కార్యాచరణను ఆయన వివరించారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పాలన గురించి ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్ అధ్యక్షులు మజ్జి అప్పారావు, పోలు విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జులు మార్తి లక్ష్మి, కుక్కా తాతబ్బాయి, నగేష్ చంద్రారెడ్డి (గణేష్), కంచుమర్తి చంటి, దాసి వెంకట్రావు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

నగరంలో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి కలసికట్టుగా పనిచేద్దామని సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. పార్టీ కార్యాలయంలో నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి అధ్యక్షతన అనుబంధ విభాగాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ వెలుగులు తెచ్చిన వైఎస్సార్ సీపీని తిరిగి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీ విజయానికి నిబద్ధత, నిజాయితీతో పని చేయాలన్నారు. ఎస్సీ సెల్ చైర్మన్ కాటం రజనీకాంత్, వైద్య విభాగం చైర్మన్ కృష్ణారావు, ఎస్టీ సెల్ చైర్మన్ సాలా సావిత్రి, టీచర్స్ సెల్ చైర్మన్ పతివాడ రమేష్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ రబ్బాని, మారిశెట్టి వెంకటేశ్వరరావు, సాంబ తదితరులు మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

దైవాన్ని రాక్షసుడిలా మారుస్తారా!

ఎంపీ భరత్‌రామ్ ఆగ్రహం

రాజమహేంద్రవరం సిటీ: హిందువులు ఎంతో పవిత్రంగా భావించే విష్ణుమూర్తి అంశమే జగన్మోహనుడని, అటువంటి దైవాన్ని ఒక రాక్షసునిగా చిత్రీకరించిన నారా లోకేష్, టీడీపీ నేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక క్వారీ మార్కెట్ సెంటర్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చంద్రాసుర దహనం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ టీడీపీ నిర్వహించిన జగనాసుర సంహారం హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందన్నారు. సనాతన ధర్మానికి తిలోదకాలిచ్చే రీతిలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం బాధాకరమన్నారు. జగన్నాథుడిగా విష్ణుమూర్తిని, శ్రీకృష్ణ భగవానుడిని హిందువులు అత్యంత భక్తి ప్రపత్తులతో కొలుస్తారన్నారు. టీడీపీ నాయకులు విజయ దశమి పర్వదినంలో జగన్నాథుడిని రాక్షసుడిగా చిత్రీకరిస్తూ సంహరించే కార్యక్రమాన్ని చేపట్టడంపై తమ పార్టీయే కాదు ప్రజలంతా ముక్త కంఠంతో నిరసన తెలియజేస్తున్నారన్నారు. దేవుళ్లను అవహేళన చేయడం, రాజకీయాల్లోకి లాగడం పైపెచ్చు పైత్యం ముదిరి ఏకంగా ఆ దైవం పేరుతో తయారు చేసిన ఆకృతిని మంటల్లో వేయడం టీడీపీ పిచ్చికి పరాకాష్ట అన్నారు. సెంట్రల్ జైలులో ఉండి లేఖలు రాస్తున్న చంద్రబాబు దీనిపై స్పందించి ప్రజలకు క్షమాపణ చెబుతూ లేఖ రాయాలన్నారు. టీడీపీ సోమవారం నిర్వహించిన ఆందోళనలో వైట్, రెడ్ దహన కార్యక్రమంలో వినియోగించారని ఆ రెండూ జనసేన జెండా రంగులని ఆ మంటల్లో ఎందుకు వేశారో ఇప్పటికైనా జనసేన పార్టీ వర్గీయులు ఆలోచించాలని ఎంపీ భరత్ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఆందోళనకు నల్ల రంగు ఉపయోగిస్తారన్నారు. టీడీపీ తీరు చూస్తుంటే జనసేనకు వెన్నుపోటు పొడిచే కార్యక్రమానికి లోకేష్ శ్రీకారం చుట్టాడేమో అనిపిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, నాయకులు బర్రే కొండబాబు, మార్తి లక్ష్మి, అజ్జరపు వాసు, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్, పీతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చంద్రాసుర దహనంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్

ట్యాక్సీ కార్మికుల సంక్షేమానికి కృషి

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ట్యాక్సీ కార్మికుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. మంగళవారం స్థానిక హైటెక్ బస్టాండ్ వద్ద ట్యాక్సీ స్టాండ్ యూనియన్ సభ్యులు ఎంపీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ట్యాక్సీ ఓనర్స్, డ్రైవర్స్‌ను ఎంపీ అభినందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో పార్టీలో చేరినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ సంఘ పరంగా, వ్యక్తిగతంగా ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ట్యాక్సీ స్టాండ్ యూనియన్ సభ్యులు నిర్వహించిన ర్యాలీని పార్టీ జెండా ఊపి ప్రారంభించి ఎంపీ పాల్గొన్నారు. నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ నుంచి ప్రధాన వీధులు, జంక్షన్ల మీదుగా కొంతమూరు వరకూ ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ట్యాక్సీ డ్రైవర్లు

మధుర గాయకుడు మన్నాడే

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ హిందీ గాయకుడు మన్నాడే వర్ధంతిని స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదిక వద్ద మంగళవారం నిర్వహించారు. దీనికి నటుడు, గాయకుడు, ఆర్కెస్ట్రా పితామహుడు శ్రీపాద జిత్ మోహన్‌మిత్ర అధ్యక్షత వహించగా ముద్రగడ ఏసుబాబు జ్యోతిని వెలిగించారు. జిత్‌మోహన్ మిత్ర మాట్లాడుతూ మన్నాడే తన మధుర గానంతో పలు చిత్రాల్లో పాటలు పాడి సంగీత ప్రేమికుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. డాక్టర్ గిరజాల సోమరాజునాయుడు మాట్లాడుతూ శాస్త్రీయ సంగీత పరమైన పాటలకు మన్నాడే పెట్టింది పేరని కొనియాడారు. బి.సీతారామారావు మాట్లాడుతూ మన్నాడే ఒక్క హిందీలోనే కాకుండా దాదాపు 13 భాషల్లో గాయకుడిగా రాణించారన్నారు. సినీ విశ్లేషకుడు అడబాల మరిడియ్య, శ్రీమిత్ర, డాక్టర్ వంకా బాలకృష్ణ, టీవీ శేషగిరి, వి.జగపతి, కృష్ణారావు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.



మన్నాడే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో భాస్కర్‌కృష్ణ చారిటబుల్ ట్రస్ట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన విద్యార్థులకు ఉన్నత విద్యనందించడానికి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటుచేసిన నల్లమిల్లి లక్ష్మి(ఆడిటర్), సురేష్‌రెడ్డిలను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం చారిటబుల్ ట్రస్ట్ లోగోను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నిదానాల్లోకి విద్యా దానం చాలా గొప్పదన్నారు. ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ తమ సేవలందించేందుకు ప్రణాళికలు రచించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి తదితరులు పాల్గొన్నారు.



ఉమామార్కండేయ దేవాలయంలో అమ్మవారు

శక్తిరూపిణి... ముక్తి ప్రదాయిని

- ముగిసిన దసరా ఉత్సవాలు
- ఆఖరిరోజు రాజరాజేశ్వరీ దేవిగా అలంకరణ

సీటీఆర్ఐ: అమ్మలగన్నకు భక్తులు నీరాజనం పలికారు.. శక్తిరూపిణిని మనసారా కొలిచి తన్మయత్వం పొందారు. దసరా తొమ్మిది రోజుల పాటు దేదీప్యమానంగా అమ్మవారి ఉత్సవాలు జరిగాయి. చివరి రోజు శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవీచౌక్‌లో బాలా త్రిపుర సుందరిదేవి అమ్మవారు సోమవారం మహిషార మర్దినిగా, మంగళవారం రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఉమామార్కండేయ స్వామివారి దేవాలయంలో పార్వతీ మాతను రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో 12 కిలోల వెండితో అమ్మవారికి అలంకరణ చేశారు. అక్షరకోటి గాయత్రీ శ్రీచక్రపీఠంలో పూర్ణాహుతి, శమీపూజ నిర్వహించారు. ఉమారామలింగేశ్వర ఆలయం, ఉమాకోటిలింగేశ్వర ఆలయం, శ్రీసారంగధరేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

జమ్మి చెట్టుకు ఎంపీ పూజలు

పూజల్లో జమ్మి చెట్టుకు విశిష్టత ఉందని పురాణాలు చెబుతున్నాయని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక గోదావరి నది ఒడ్డున పుష్కర ఘాట్ వద్ద ఎంపీ శమీపూజ చేశారు. తొలుత గోదావరి మాతను, కనకదుర్గమ్మను భవానీ దీక్షలో ఉన్న ఎంపీ భరత్ పూజించారు. అనంతరం విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శమీ (జమ్మి) పూజ చేశారు. జమ్మి చెట్టును పూజిస్తే జీవితంలో విజయాలు వరిస్తాయని అన్నారు. పూజ అనంతరం గోదావరి నదికి నిత్య హారతులను ఎంపీ భరత్ రామ్, మోనా దంపతులు, కుమార్తెలు మార్గాని జయాని, శివాన్ని రామ్, ఎంపీ మాతృమూర్తి ప్రసూన, వైఎస్సార్ సీపీ అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాధిక దంపతులు, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు వీక్షించారు.

ముగిసిన ఉత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లో విజయ కనకదుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలను ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఆలయ గౌరవాధ్యక్షులు పిల్లి శ్రీను, లలితాదేవి దంపతులు అభిషేకాలు చేశారు. లలితాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు తదితరులు దర్శించుకున్నారు. బాలాజీపేట సెంటర్‌లో విజయ కనకదుర్గాదేవి ఆలయంలో ఆలయ ధర్మకర్త గొందేశి శ్రీనివాసులరెడ్డి నేతృత్వంలో గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులు ఆహూతులను అలరించాయి. అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. కాతేరు శ్రీదేవి నగర్ బీసీ కాలనీలో శ్రీదేవి ఫ్రెండ్స్, మహిళా కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు జరిగాయి.

కడియం: మండలంలోని వేమగిరి, కడియం, మురమండ, దుళ్ల, కడియపులంక, వీరవరం గ్రామాల్లోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయాల్లో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినామ సంకీర్తనలు, ఆధ్యాత్మిక గీతాలాపనలు చేపట్టారు. మురమండలోని షిర్డీ సాయి పంచాయతన క్షేత్రంలో బాబాకు అన్నాభిషేకం జరిగింది. అనంతరం అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆయా ఆలయాలకు చెందిన షిర్డీసాయి సేవా సమితి సభ్యులు పర్యవేక్షించారు.



గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు



గోదావరి హారతిని వీక్షిస్తున్న ఎంపీ భరత్‌రామ్ తదితరులు



కాతేరులో బతుకమ్మ సంబరాల్లో భక్తులు



వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు